

నేను బస్సులో మా పల్లెటూరు రోడ్డు దగ్గరకువచ్చిచేరేసరికి నా వొళ్లు పిండేసినట్లయింది. బస్సుప్రయాణం నాకు కొత్త కాకపోయినా ప్రయాణం చేసినప్పుడల్లా అనుకుంటాను- యీ సారి యిట్లాంటి బుద్ధి తక్కువపనులు చేయనని. నా వుత్తరీయం, కాన్వాసుసంచీ, చెప్పులూ బయటకు పీక్కువి కిందకు దిగుదామని ఎక్కే దిగే జనం వెనక్కూ ముందుకూ గుంజుకుంటున్న రద్దీమధ్యలో పడ్డాను.

"నాగిరత్తీ ఎక్కవేం ? ఆచ్చేసూ దా దా బస్సు పోతావుంది - ఆసందయ్యా మా పిల్లగాడు కానాటంలేదూ - కొత్తై జరగవయ్యా మాలావు నువ్వే మనగాడివల్లే వుండే ? వుండవమ్మా నీ యిల్లు బంగారంగాను- దిగనియదేం ? ఇదుగో నిన్నే యాడికయ్యా నువు తోసుకొచ్చేది ? జరగవయ్యా జరుగు, యీ బస్సేవన్నా నీ సొంత సొమ్మెట్టా? ఎహ వుండండి, మొదలు దిగనిత్తేగా ?-" అనే కుమ్ములాటమధ్య నేను విసిరేసినట్టు రోడ్డు మీదపడి, బస్సులో యిరుక్కున్న నా వుత్తరీయం తోకను బలంకొద్దీ లాక్కుని, వొళ్ళు దులుపుకుని రోడ్డుమీద గట్టిగా కాలు మోపి చూసుకొనేసరికి నా లాల్చీ ఎడం చెయ్యి మణికట్టుదగ్గిర జానెడుమేర చిరిగి, చేతిలో వున్న కాన్వాసుసంచి హాండిలు ఒక పక్క తెగి ఇంకోపక్క ఆధారంమీద వేళ్ళాడుతున్నది. రోడ్డుపక్క పూరిపాక కాఫీ హోటల్లో అల్లప్పచ్చడితో యిడ్లీ, పెసరట్ తిని, నోరు కాలేట్టు కాఫీ తాగినాకగాని నా దేహస్థితి సహజధోరణికి రాలేదు.

ఇరవై ఏళ్ళకిందట నాకు పదేళ్ళ వయసప్పుడు మా నాన్న మా వూళ్ళో ఆస్తంతా పోగొట్టుకొని, కుటుంబంతో గూడూరు వెళ్ళి మైకా కంపెనీలో గుమాస్తాగా చేరి అక్కడే స్థిరపడ్డారు. నేను గూడూరు వెళ్ళిన కొన్నాళ్ళవరకూ మావూరి వాతావరణం నాకు కలలో కనిపిస్తుండేది. తరువాత ఎప్పుడైనా కళ్ళికొట్టు దగ్గర స్నేహితుల్తో చిన్నప్పటి మావూరి వింతలు చెప్పుతుండేవాణ్ణి. ఇరవై ఏళ్ళ తరువాత మావూరు యిదే నే రావటం.

అక్కడికి మా వూరు రెండు మైళ్ళ దూరంలో కనుపిస్తుంది. గడ్డివాములూ, పూరిపాకలూ, సున్నపు గోడల పెంకుటిళ్ళూ, చెట్లు కొంచెం గుబురుగాపెరిగి నాలుగైదు డాబాలూ, మేడలూ కొత్తగా కనుపించడం మినహాగా చిన్నప్పుడల్లేనేవుంది మావూరు.

ఇంకా మావూరు రెండుమూడు ఫర్లాంగులు దూరం వుందో లేదో - పెళపెళ వురుముల్తో జోరున వాన సాగింది. నాకు తెలుసు యీ శ్రావణమాసంలో వానదెబ్బ తగలకుండా ప్రయాణం చేయగలిగినవాడు ధన్యుడని ! పంచ పైకి ఎగగట్టి, చెప్పులు

యింకోచేత పట్టుకొని, ముందూవెనక చూడకుండా రోడ్డుపక్క చెట్లకిందుగా గుడ్డిగా పరిగెత్తటం మొదలుపెట్టాను. తళుక్కున మెరసి "ఢా"ప్పున పడింది పిడుగు. ఎగరొప్పుతూ దారిపక్క ఓ చిన్న రాతికట్టడం చూసి అందులోకి జొరపడ్డాను. తడిసి ముద్దయి.

కళ్ళు బైర్లుకమ్మి కట్టడంలోకి ఎగిరి వచ్చిపడ్డ నేను కొంచెం తెప్పరిల్లుకుని ఏది ఏమిటని నాచుట్టూ సూసుకున్నాకగాని ఆ కట్టడద్వారం పక్కనే కూచున్న మనిషిని గమనించలేదు.

నెరిసి జారిన బొద్దుమీసాలూ, పైపంచతో వొళ్ళూ తలా కప్పుకొని మొహంమటుకు బయటపెట్టి చూస్తున్న ఆ మనిషి మామూలు మనిషే నని తెలుసుకున్నాకగాని రాతి కట్టడాన్ని బాగా పరిశీలించలేదు నేను. రెండు రాతిస్తంభాలు, పదికిఏడడుగు లున్న పంచా. దానికి చేరి తలుపులూ, ద్వారబంధం లేని ద్వారంతో పదడుగుల చదరపుగది. ఆ గది మధ్య నాలుగడుగుల ఎత్తయిన రాతి కట్టడం మీద ఒక నందివిగ్రహం వున్నది. గోడలు కొంచం శిధిలమై రాతికి రాతికి మధ్య నెర్రె లేర్పడి పురుగూ పుట్రకు అనుకూలంగా వుండట మేమిటి — ఆ నంది వెనక గోడ రాళ్ళ నెర్రెల మధ్య బారెడు పాముకుసం వేళ్ళాట్టం చూశాను.

"మం దే వూరేం ?" అనడిగాడు, ద్వారం పక్క వొదిగి గొంతుకూచున్న ఆ మనిషి.

ఆ కట్టడం పంచముందు రోడ్డు పక్క చింతచెట్లకింద దాదాపు ఓ యిరవై బర్రె గొడ్లు తడుస్తూ నుంచుని నెమరేస్తున్నయ్.

"ఏ వూ రనడుగుతే మాట్లాడవేం ?" మళ్ళీ అడిగా డా మనిషి. ఆ మనిషి పక్కనే అంగుళం ముప్పాతిక మందాన వెదురు చేతికట్టె పడివున్నది.

"మా దీ వూరే. ఇప్పుడు గూడూర్లో వుంటున్నాం." సమాధానం చెప్పాను, మరీ బాగుండదని.

"ఈ వూరా ? ఎవరబ్బాయివేం ?" అడిగా డా మనిషి.

"నేను దర్భల సూరయ్యగారి పెద్దబ్బాయిని. మా నాన్న నీకు తెలుసా ?" అనడిగాను.

తళుక్కున మెరిసి 'టఫీ' మని పడింది పిడుగు. నేను చప్పున ఆ మనిషి పక్కనే ద్వారం మండిగంమీద కూచుని "ఈ వాన చెడ్డ ప్రమాదంగా వుందే !" అనన్నాను, ఆ మనిషి మొహంలోకి చూస్తూ.

"అర్రే బండపడ ! నువు సూరయ్యగారబ్బాయి గోపాలానివి గాదూ ! గురుతు పట్టకనే పోతినే! అబ్బో సానా ఏళ్ళయింది ! నేను గునపం ఈరయ్యను. గాపకం వుండానా ?" అన్నాడు వీరయ్య, నా వేపు మురిపెంతో చూస్తూ.

"నువ్వా వీరయ్యా ! ఎవరో ననుకున్నా ! ఎంత పెద్దవాడి వైనావు ! నా చిన్నప్పుడు ను వ్వొకరోజు మీయింటి కడ్డంగా వున్న ఆ రామయ్యగారి రెండెడ్ల బండిని అమాంతంగా పైకెత్తి 'హరహరా' అంటూ గిరవాటు వేశావు జ్ఞాపకం వుందా ?" అన్నాను వీరయ్యను వింతగా చూస్తూ.

ఆ వెనకటి రోజులు చాలా గొప్ప వన్నాడు వీరయ్య దిగులుగా. ఆ మనుషుల సమాచారమే వే రన్నాడు. మా నాయన మంచివా డయినా నష్టజాతకు డన్నాడు. ఆస్తంతా పెళ్ళి పేరంటాలకంటూ పాడు చేసి, కుటుంబంతో దేశంపాలయినా డన్నాడు. మా నాయనే కాదు, యింకా చాలా కుటుంబాలు వుద్యోగాలకై తేనేం, చదువులకై తేనేం బస్తీలకు చేరి, సొంత వూళ్ళో ఆస్తు ల్లేకుండా చేసికొని వూరంతా పాడుచేశా రన్నాడు.

"నే నారోజు, రామయ్య బండిని ఎత్తేసినప్పుడు ఏమయిందో నీకు తెల్సా ? పాతిక మందిని ఎంటేసుకుని నన్ను తన్నడానికి వచ్చాడు రామయ్య ! ఆమైన ఏమయిందనుకున్నా ? మన నరసయ్యగారి ఎంకటాద్రి అటు పోతూ యీ యవారం చూసి, గబాల్నొచ్చి మా గుమ్మాని కడ్డంగా నిలబడి "ఈరయ్యమీద యీగ వాలిందంటే వొచ్చిన వాణ్ణి వొచ్చినట్లు నంపుతా" నన్నాడు. "ఈరయ్య యింటి కడ్డంగా జబర్దస్తీగా బండి నెందు కడ్డంగా పెట్టా" లని గదమాయించడిగాడు. ఆ దెబ్బతో నలుగురు పెద్దమడుసులు పోగై రామయను సివాట్లు పెట్టేతలికి తోక ముడుసుకుని అట్టనే తిరిగి పోయ్యాడు రామయ్య !" అన్నాడు వీరయ్య నావంక చూస్తూ.

"అవును ఆరోజు సాయంత్రానికి గాని నాకు తర్వాత జరిగిన భాగవతం తెలియలా ! వెంకటాద్రి నాకు బాగా జ్ఞాపకం వున్నాడు. బలే దర్జామనిషి ! ఆ రోజుల్లో మనవూరు ఒకపైల్వాన్ ముఠావొచ్చి 'ఫీట్సు' చేశారు జ్ఞాపకం వుందా వీరయ్యా ? అందులో ఎద్దంటి గిరిజాల రాజొకడు రకరకాల కుస్తీపట్లు పట్టి ఆంధ్ర దేశంలో తనని కుస్తీలో ఎవరూ ఓడించలేకపొయ్యా రని 'పెఠీ' మని జబ్బచరిచాడు! అప్పుడు వెంకటాద్రి గోదాలోకి దూకిన దూకటం, గిరజాల రాజును చిత్తుగా కొట్టి మూడుసార్లు పోటీ చేసేసరికి జనమంతా ఒకటే చప్పట్లు చరిచారు ! ఆ దెబ్బతో గిరజాలరాజు పైల్వాన్ముఠా అదేపోత పోయినారు !" అన్నాను నేను.

వురుములు మెరుపుల్తో కుండపోతగా కురుస్తున్నది వాన. చీరె మోకాళ్ళమీదకు దోపుకొని, పమిట నెత్తిమీదగా లాక్కొని, రోడ్డుమీద గబగబా పరిగెత్తుకుంటూ చెంగున గంతేసి పంచలో కొచ్చి నుంచుం దో ఆడమనిషి. ముదు రెరుపు చీరె, తెల్ల రెవిక, భారీగా కొంచెం చామనచాయ, పెద్దకళ్ళతో చూస్తున్న ఆమనిషి ఆకారాన్నీ, మొహాన్నీ రెప్ప వాల్చకుండా చూస్తున్నాను నేను.

న న్నొకసారి ఆ కళ్ళతో చూసి "ఈరయ్యన్నా, నువు యీడే వున్నావంటయ్యా ! ఎదవసచ్చిన వాన. ఎంత సేపటికీ తగ్గకపోతే సావిట్లో బర్రెగొడ్డు అరుస్తావుందని లగెత్తుకొచ్చా ! సూశావా సూశావా ఈరయ్య

న్నా? యీళ్ళ జిమ్మడ! పొద్దుననంగా సిమ్మి ముగ్గేసిపోతే లోన ఎంత సెత్త సేసి పొయ్యారో. సూశావంటయ్యా? యీపాలి యీ పిల్లసంచు ఈడ అగుపించారంటే సింతబెరికల్తో బాదిపెట్టు! అప్పటికి గాని బుద్దిరాదు సచ్చినోళ్ళకి! గొడ్డు అరుస్తా వుంటది, నే సావిడికి ఎల్లొత్తా ఈరయ్యా న్నోవ్!" అంటూ రాతి కట్టడం పక్కనే కంచలమధ్య కాలిదారికుండా తడిసిన వాంటితో వొళ్ళు కదుల్తూ వెళ్తున్న ఆ మనిషిని పంచ మొత్తదాకా పోయి చూసివచ్చి వీరయ్య పక్కనే మళ్ళీ చతికలపడ్డా. యింకా కళ్ళల్లో మెదుల్తున్న దా మనిషి!

"ఎవ రా ఆడమనిషి ఎక్కడో చూసిన మొహమల్లే వుందే!" అనడిగాను వీరయ్యను.

"మాణిక్క్యం, నీకు తెలవదనుకుంటా:" అన్నాడు వీరయ్య.


ఆ మనిషి మాణిక్యమా! చిన్నప్పుడు ఒకటి రెండు సార్లు చూశా. మాణిక్యం పెళ్ళి చేసుకొని పసుపు గుడ్డల్తో నాగారుబొమ్మ గుడికి వెళ్ళవస్తాంటే ఒక సారి చూశా. ఎంత అందంగా వుంది అప్పుడు మాణిక్యం! ఇప్పు డా రూపు చాలామటుకు మారిపోయింది. అయినా ఆ కళ్ళల్లో కదలిక అట్లాగే వుంది! మాణిక్యం మొగుడు పేరు శివయ్య కాదూ?" అనడిగాను.

"శివయ్య సచ్చి పదేనేళ్ళయింది. మాణిక్కమే మందు పెట్టి సంపిందన్నారు. కొంతమంది వూరిజనం. శివయ్య మూగోడని పెళ్ళినాటికి మాణిక్కానికి తెలవదు." అన్నాడు వీరయ్య.

"అందుకని శివయ్యకు మాణిక్యం మందు పెట్టి సంపిందా!" అన్నాను నేను విభ్రాంతపోయి.

"పచ్చవాతంతో శివయ్య సచ్చిపోతే మాణిక్కం ఏదో సేసిందన్నారు.! ఎందుకంటే అప్పటికే ఎంకటాద్రికీ, మాణిక్కానికీ సంబంధం వుందని వూరందరికీ తెల్చిపోయె!" అన్నాడు వీరయ్య.

"ఏమిటీ! అయినా ఈ గొడవ లన్నీ దేనికి చెప్పు వెంకటాద్రికి? రాజకీయాల్లో



చేరి గొప్ప వుపన్యాసా లిచ్చేవాడట. మా నాన్న చెప్పా డోసారి. బెంగాల్, పంజాబ్ వెళ్ళి విప్లవకారుల్తో కొన్నాళ్ళు తిరిగి నందుకు నాలుగేళ్లు జైల్లో వున్నాడని పేపర్లో చూశా. ఇదేమిటి ఖర్మ వెంకటాద్రికి?" అన్నాను.

"అవును మాణిక్క్యానికి పెళ్లయిన కొత్తల్లోనే ఎంకటాద్రి కలకత్తా పోయి జైల్లో పడ్డాడు. అసలు సంగతి యింకోటుంది మాణిక్క్యానికి పెళ్ళి కాకముందే ఎంకటాద్రికి సంబంధం వుంది. ఓనాడు మనూరి కిట్టకాల్వలో యీత లీదటానికి పోతుండగా ఎంకటాద్రికి మాణిక్క్యెం అగుపించిందంట. అదిమొదలు నాట్లు అయిపొయ్యేదాకా ఎంకటాద్రి దినం కిట్టకాలవకు పొద్దుటా మాపిటాలా పోతానేవుండాడు. సివరకి ఓ శివరేత్రి కోటయ్యకొండ తిరనాల్లో ఎంకటాద్రి మాణిక్క్యెం కలిశారంట: యిగనంతే యవారం బాగా ముదిరింది. యీ సంగతి మూగోడు శివయ్యకు తెలిసి మాణిక్క్యెం మక్కె లిరగదన్నాట్ట:'' అన్నాడు వీరయ్య

"అవును మరి." అన్నాను నేను.

"అప్పుడే ఎంకటాద్రి కలకత్తాకు ఎల్లిపోయింది. యీడ యింకో సంగతికూడా వుంది. శివయ్యకు మందు పెట్టిందని దప్పు కొట్టిన మనూరి పడమటి ముటా నాయకుడు రామయ్య సాటుసాట్న మాణిక్క్యాన్ని దక్కించుకుంటానికి బతిమిలాట్టం సాగించాడు. సూశావంటయ్యా గోపాలం?" అన్నాడు వీరయ్య.

''వెంకటాద్రి అంటే రామయ్యకు అసలే మంట. మీ యింటిముందు జాతర జరిగి నప్పట్నుంచీ. అవునా!'' అన్నాను నేను.

"అవును. ఆ కచ్చ ఎంతదాకా పోవాలో అంతదాకా పోయింది. మాణిక్క్యెం లొంగలా. కథ యీ రకంగా వుంటే యింతలో జైల్లోపడ్డ ఎంకటాద్రి తిరిగొచ్చాడు. వాళ్ళ నాయన నరసయ్య ఎంకటాద్రికి పెళ్ళిసెయ్యాలని సూశాడు. ఏం లాభం లేకపోయింది. యింక శివయ్యకూడా లేకపోవటంవల్ల మాణిక్క్యెంతో ఎంకటాద్రి సంబంధం పట్టపగ లయింది. మాణిక్క్యెం తక్కువ కులం మనిషని నరసయ్యకు తల కొట్టేసి నట్టయింది. ఈ జాతర సూసి ఎంకటాద్రి మళ్ళీ కలకత్తా పోదా మని అనుకుంటా వుండేతలికి ఎంతపని జరగాలో అంతపనీ జరిగింది!" అన్నాడు వీరయ్య, ఒక్కసారి నిట్టూరుస్తూ.

"ఏం, ఏం జరిగింది? అని చప్పున అడిగా వీరయ్య వాలకం చూసి.

"ఓ రోజు వెంకటాద్రిగారి జీతగాడు సుబ్బయ్య పడమటిపొలాలకు పోయి నీళ్ళు పెట్టుంటే తన పొలానికి నీ రెక్కకుండా వెంకటాద్రి జబర్దస్తీ చేస్తుండాడని రామయ్య నలుగురు తన మనుష్యుల్తో జీతగాడు సుబ్బన్న తల ఏటుకు పగల్గొట్టాడు! ఎంకటాద్రి రామయ్యను నిలదీసి అడిగాడు "తను సేసినపని నలుగురిముంగల వొప్పుకుని లెంప లేసుకో" మని. "నీ బాబు గాడ్తో సెప్పుకో" మన్నాడు రామయ్య. ఆ దెబ్బతో తూర్పుపడమరు పట్లదిమ్మ పగిల్నట్టు పగిల్నయ్? యిటో రెండొందల మంది అటో రెండొందలమంది అందిన వందినట్లు పలుగులు, గొడ్డళ్ళు, బరిసెలు, వసికర్రల్తో ఒకర్నొకరు తెగనరుక్కున్నారు! పొలా లన్నీ రకతం కక్కినై! ఆసంది. ఆపం దని సెయ్యెత్తి దండాలెడ్తుంటే ఎత్తిన సెయి ఎత్తినట్టు పగల్చిల్చారు! అంతే! ఎంకటాద్రీ, రామయ్యతో పాటు మూడొందలమందిని మీనాల్లోనూ రెండెడ్ల బళ్ళమీదా బస్సుల్లో గుంటూరాస్పత్రికి సేర్చారు! ఆ పోవటం ఎంకటాద్రి మనూరికి బతికి తిరిగిరాలా! అదిగో, ఆ నందికింద వుంటాడు ఎంకటాద్రి" అన్నాడు. వీరయ్య, నేలచూపులు చూస్తూ.

"యిది ఎంకటాద్రి సమాధా?" అన్నాను నేను, లేచి నుంచుని నందివిగ్రహం చుట్టూ చెరిగిన కంకరాళ్ళూ, మట్టిగడ్డలను చూస్తూ.

"పిచ్చముండ! ఎంకటాద్రి సావుతో బజార్నపడ్డ మాణిక్క్యెం ఇప్పటికీ రోజూ ఆ నందిసుట్టూ సిమ్మి, నీలు సల్లిపోతుంది!" అన్నాడు వీరయ్య.

"ఈ గాలోన యిక తగ్గిపోవదు గావి నువుగూడా వూళ్ళో కొస్తావంటయ్యా ఈరయ్యబావా!" అంటూ సమాధిపక్క నుంచి చెంగున పంచలోకి వచ్చి పకపక నవ్వుతూ అడిగిన మాణిక్యం నన్ను చూసి చటుక్కున ఆగిపోయింది.

ఇంతకుముందు వీరయ్యను 'వీరయ్యన్నా' అని పలుకరించిపోయిన మాణిక్యం యిప్పుడు 'వీరయ్యబావా' అని పిలవటం గూబ అదిరిన ట్టనిపించి మాణిక్యాన్ని సూటిగా చూశాను.

బయట తళుక్కున మెరుపు మెరిసింది గాని పిడుగు పడలేదు.

